క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



ఫిరంగిపురం: సేవాభావంతోనే దేశపౌరుడిగా గుర్తింపు లభిస్తుందని మార్నింగ్‌స్టార్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఎం.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలలో 2021–23 సంవత్సరం ఎన్‌సీసీ క్యాడెట్లకు బీ సర్టిఫికెట్లు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ ఎందరో ఎన్‌సీసీ విద్యార్థులు భారత సైన్యంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ పేరు ప్రఖ్యాతలు పొందుతున్నారన్నారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లకు బీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు 25వ బెటాలియన్ సాట్ హరికృష్ణ, వెంకట శివ ప్రసాద్, ఎన్‌సీసీ అధ్యాపకుడు కోటానాయక్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

మంగళగిరి: నగరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఇప్పటికే స్థలం కేటాయించడం జరిగిందని, నిర్మాణం కోసం టెండర్లకు వెళుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బాప్తిజం ఘాట్ కోసం స్థలం కేటాయించి నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే ఆర్కేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కాగా కాజలో కేటాయించిన క్రిస్టియన్ శ్మశాన వాటికను వినియోగించుకునే విషయంలో ఎదురైన ఆటంకాలను కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లారు. క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ పాస్టర్ బి.రవి ప్రకాష్, ప్రెసిడెంట్ పాస్టర్ ప్రాతూరి సహదేవ్, జనరల్ సెక్రటరీ పాస్టర్ పిల్లి దయారత్నకుమార్, కో–ఆర్డినేటర్ కంతేటి లార్డ్ వెస్లీ, పాస్టర్ బేతాళ సాల్మాన్ రాజు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మేడికొండూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13 గురువారం జరగనున్నట్లు ఎంపీడీఓ కె.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు, అన్నిశాఖల అధికారులు తప్పక పాల్గొనాలని తెలిపారు. గత సమావేశంలో తీసుకున్న టార్గెట్‌ల అమలు తీరుపై చర్చ జరుగుతుందన్నారు.

వైద్యుడి నివాసంలో చోరీ

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో ఓ వైద్యుని నివాసంలో చోరీ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెం అంబటినగర్‌కు చెందిన వైద్యుడు గొద్దంటి వేణుగోపాల్ నగరంలో డెంటల్ వైద్యశాల నిర్వహిస్తుంటాడు. మంగళవారం ఉదయం 8 గంటలకు వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటికి తాళాలు వేసి చీరాల వెళ్లి రాత్రి 11 గంటలకు ఇంటికి తిరిగివచ్చాడు. ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం కూడా పగులగొట్టి బీరువాలో దాచిన రూ.లక్ష నగదు మాయమైంది. దీంతో బుధవారం తన నివాసంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారెమ్మ తల్లి బోనాల జాతర



తెనాలి: స్థానిక యడ్ల లింగయ్యకాలనీలో వేంచేసివున్న మారెమ్మ తల్లి బోనాల జాతర బుధవారం నిర్వహించారు. అమ్మవారికి శాకంబరి అలంకారం చేశారు. భక్తుల సహకారంతో 500 మందికి అన్నదానం చేశారు. వరుసగా అయిదో ఏట చేసిన జాతరను పల్లపోతుల నాంచారయ్య ప్రథమ పూజారి గురుభవాని, టి.మోసు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోలీసు కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం పోలీసుల కుటుంబాలకు అధికారులు చెక్కులు అందజేశారు. పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్ఐగా విధులు నిర్వర్తించే వెంకట్రావు బ్రెయిన్ స్ట్రోక్‌తో గతనెల ఆరో తేదిన మృతి చెందారు. ఈ మేరకు విడోఫ్లాగ్ ఫండ్ కింద మంజూరైన రూ.50 వేల చెక్కుని వెంకట్రావు భార్య శ్రీదేవికి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. తెనాలి సబ్ డివిజన్ పీసీఆర్‌లో సీఐగా విధులు నిర్వర్తించే ఎ.శ్రీనివాసరాజు, మంగళగిరి పట్టణ పీఎస్ కానిస్టేబుల్ కె.మాధవరావు, నార్త్ సబ్ డివిజన్ మంగళగిరిలో హెచ్‌సీ పి.శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శ్రీనివాసరాజు భార్య ప్రతిభారాణి, మాధవరావు భార్య స్వర్ణ, శ్రీనివాసరావు భార్య నాగమణిలకు రూ.లక్ష చెక్కులను ఏఎస్పీ కె.సుప్రజ అందించారు.

కరోనాకు వెరవకుండా బీమా చేసి, ధీమా నింపారు

వలంటీర్లకు వందనం

మంగళగిరి: ఈ చిత్రంలో మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పేరు కాకి ప్రభాత సూర్య. మంగళగిరి 18వ సచివాలయ పరిధిలోని టిప్పర్ల బజారులో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కరోనా సమయంలో ఇతను చేసిన సేవలను ఆ ఏరియా ప్రజలు ఇప్పటికీ స్మరించుకుంటూ ఉంటారు. కరోనా విజృంభణలో ఎవరి ఇళ్లలో వారు తలుపులు మూసేసుకుని ఇంట్లోనుంచి బయటకు రానిసమయంలోనూ ప్రభాత సూర్య తనకు కేటాయించిన ఇళ్లలో ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేయడమే కాకుండా, ఎవరైనా అస్వస్థులయ్యారా.. జ్వరాలేమైనా ఉన్నాయా అంటూ పలకరించి, ధైర్యం చెప్పేవాడు. కరోనా బారినపడి క్వారంటైన్‌లో ఉంటున్న వారికి నిత్యవసర సరుకులు, మందులు అందజేయడమే కాకుండా.. వారికి ఏమీ కాదంటూ చెబుతూ మనోధైర్యం నింపేవాడు. అంతేకాకుండా కరోనాతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి కావాల్సిన సేవలు అందించేవాడు.



షేక్ నూర్జహాన్‌తో వలంటీర్ ప్రభాత సూర్య

వలంటీర్ లేకుంటే మా కుటుంబం వీధినపడేది

నా భర్త షేక్ ఆదంఖాన్ లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. మాకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నా భర్తకు కరోనా సోకడంతో ఆసుపత్రిలో చేర్చారు. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మా వలంటీర్ కాకి ప్రభాత సూర్య బీమా లేదని తెలుసుకుని, కరోనాకు భయపడకుండా గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నా భర్త ఆదంఖాన్ చేత తంబ్ వేయించి బీమా చేయించాడు. తంబ్ వేసిన అరగంటకే నా భర్త మృతి చెందాడు. వలంటీర్ సూర్య తంబ్ వేయించడంతో రూ 2 లక్షల బీమా వచ్చింది. రెండవ కుమార్తె పెళ్లి చేయడంతో పాటు అప్పులు కాకుండా బయటపడ్డాం. అంతేకాక వెంటనే వలంటీర్ నాకు పెన్షన్ మంజూరు చేయించడంతో పాటు ఇంటి స్థలం ఇప్పించాడు.

– షేక్ నూర్జహాన్, మంగళగిరి

నెలాఖరుకు మగ్గం షెడ్లు అప్పగించండి

అధికారులకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు సూచన

మంగళగిరి: తుది దశకు చేరుకున్న చేనేత మగ్గం షెడ్లను పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసి ఈనెలాఖరునాటికి లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. బుధవారం నగరంలో చేనేత మగ్గం షెడ్లను, కూరగాయల మార్కెట్‌ను, రజక, సగర కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలిసి పరిశీలించారు. చేనేత జౌళి శాఖ అధికారులు వెంటనే లబ్ధిదారుల ఎంపికలో మార్గదర్శకాలను చూసుకుని లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి మగ్గాల షెడ్లను అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కూరగాయల మార్కెట్ ఆధునీకీకరణకు చర్యలు..

నగరంలోని రాజీవ్ గృహకల్పవద్ద కల కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ ఆధునీకీకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కూరగాయలు అమ్మకాలు కొనుగోలుకు అనుకూలంగా షెల్టర్ హౌస్, స్లాట్ హౌస్, హోల్‌సేల్ మార్కెట్, చిరు వ్యాపారులు కూరగాయలు విక్రయించుకునేందుకు షాపులు నిర్మిస్తామన్నారు. చిరువ్యాపారులతో పాటు రైతులు వినియోగదారులు, హోల్‌సేల్ మార్కెట్ నిర్వహణకు అనుగుణంగా శాశ్వత కట్టడాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మిగిలిన కార్పొరేషన్‌లలో మార్కెట్‌లను అధ్యయనం చేసి శాశ్వత కట్టడాలతో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం రజక, సగర కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను పరిశీలించి తుదిదశకు చేరుకున్న కమ్యూనిటీ హాల్స్‌ను వెంటనే పూర్తి చేసి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరికొందరికి కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు స్థలాల లభ్యత కొరకు చూస్తున్నామని స్థలం దొరికిన వెంటనే నిర్మించడం జరుగుతుందన్నారు.



చేనేత మగ్గం షెడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి

రత్నాల చెరువు పూడికతీత పనుల పరిశీలన...

మంగళగిరి: నగరంలోని రత్నాల చెరువు డ్రైనేజీ పూడికతీత పనులను బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తమ ప్రాంతం ముంపునకు గురి అయ్యే ప్రమాదం ఉందని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆర్కే మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే అవుట్ ఫాల్ డ్రైన్‌లో పూడికతీత పనులు ప్రారంభించి ముంపు సమస్యను నివారించాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో అధికారులు పూడికతీత పనులు ప్రారంభించగా బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షం నీరు ఇళ్లల్లోకి చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. డీఈ కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని చినకాకాని ఎన్నారై వైద్యశాల వెనుక చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించి, పలు సూచనలు చేశారు.

భారతీయ సమాజం పుస్తకావిష్కరణ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి సెక్రటేరియల్‌లో ఎస్అండ్ఎస్ పబ్లికేషన్ వారి భారతీయ సమాజం పుస్తకాన్ని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు ఆదిమూలపు సురేష్, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలు రాయడానికి మాకం శేషావలి సంరక్షణలో ఎస్అండ్ఎస్ పబ్లికేషన్ ఎంతో దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు అనేక రకాల పోటీ పరీక్షలకు పోటీపడేందుకు తగిన సమాచారం సంపూర్ణంగా ఉండేవిధంగా పుస్తకం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. మాకం శేషావలి రానున్న రోజుల్లో విద్యార్థుల భవిష్యత్తుకై ఎన్నో మంచి పుస్తకాలు విడుదల చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాల్సిందే



మంగళగిరి: వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్థానిక వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నగర పరిధిలోని నిడమర్రు సచివాలయం ఎదుట పవన్ చిత్ర పటాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ తాము సమాజ సేవలో భాగస్వాములుగా ఉన్నామని, జీతాల కోసం కాకుండా సేవా భావంతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమ మనోభావాలు దెబ్బతీసేలా పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. కోవిడ్ బారిన పడిన వారిని కుటుంబ సభ్యులు, బంధువులు సైతం తాకేందుకు భయపడినా తాము ప్రాణాలు ఒడ్డి ఎందరో ప్రాణాలను కాపాడామన్నారు. తమ పరిధిలోని అర్హులైన ప్రతి ఇంటికి వెళ్లి ఎలాంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పు ఒప్పుకుని పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే ఇప్పటికే జరుగుతున్న ఆందోళనను మరోస్థాయికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు బొమ్మి గిరిధర్, తాడిబోయిన శ్రీనివాసరావు, కూరాకుల రవి, కర్రి వెంకట్రావు, శ్రీలక్ష్మి, వాణి పాల్గొన్నారు.

ఏపీ వీఐటీ, ఐఎస్‌డీసీ యూకే మధ్య అవగాహన ఒప్పందం

తాడికొండ: ఏపీ వీఐటీ విశ్వవిద్యాలయం, ఐఎస్‌డీసీ యూకే మధ్య బుధవారం అవగాహన ఒప్పందం కుదిరినట్లు యూనివర్సిటీల ప్రతినిధులు తెలిపారు. ఒప్పందం ప్రకారం వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయంలో డిజిటల్ మార్కెటింగ్ స్పెషలైజేషన్ అభ్యసిస్తున్న బీబీఏ విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐఎస్‌డీసీ సర్టిఫికెట్‌ను అందజేస్తుందని తెలిపారు. బీకాం (ఫైనాన్స్) అభ్యసిస్తున్న విద్యార్థులకు కేవలం నాలుగు పేపర్లు పూర్తిచేస్తే ఏసీసీఏ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ పొందే వీలు కలుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ ఎస్.వి. కోటారెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఐఎస్‌డీసీ సౌత్ జోనల్ హెడ్ రాజేష్ పూనియా డిజిటల్ మార్కెటింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో ఐఎస్‌డీఎస్ సర్టిఫికెట్ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ శాంతకుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ రాఘవేంద్ర అఖిల్ అగర్వాల్, ఐఎస్‌డీఎస్ ఏపీ–తెలంగాణ రీజినల్ మేనేజర్ డాక్టర్ అరుణ్ కుమార్ శివకుమార్, డాక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకుంటున్న యూనివర్సిటీల ప్రతినిధులు

ముంపుపై రైతుల వాట్సాప్ సందేశం

- స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే
- సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి ప్రాంతంలో పంటపొలాల్లోని వర్షపు నీరు బయటకు వెళ్లక పంటపొలాలు మునిగిపోవడంతో రైతులు మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కి వాట్సాప్ మెసేజ్ చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే బుధవారం మంచికలపూడిలోని ముంపునకు గురైన పంటపొలాలను పరిశీలించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పరిశీలించారు. ఈ మధ్యకాలంలో విశాఖ నుంచి చెన్నై వరకు రైల్వే అధికారులు 3వ లైన్ ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టాగా ఉన్న పంటకాలువలను పూడ్చివేయడం వల్ల పంటపొలాలను ముంపునకు గురి అయ్యాయని నిర్ధారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రైల్వేశాఖ అభివృద్ధి పనులలో భాగంగా రైల్వేట్రాక్ కింద వున్న తూముల వద్ద మట్టిపోయడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక సుమారు 70 ఎకరాల వరకు నీట మునిగాయని, త్వరలో నాట్లు వేయాల్సి ఉండడంతో రైతులు ఆందోళన చెంది వాట్సాప్ మెసేజ్ చేశారని, అధికారులతో కలసి పరిశీలించి సమస్యను గుర్తించి రైల్వేశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, వారు సమస్యను పరిష్కరించడానికి సమయం కోరడంతో రైల్వేశాఖ వద్ద అనుమతులు తీసుకుని సొంత నిధులతో పంటకాలువలను పునరుద్ధరిస్తున్నామని, రెండు మూడు రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు. మోరంపూడి బకింగ్‌హామ్ కెనాల్ వద్ద దెబ్బతిన్న షట్టర్‌ను పరిశీలించి మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. డి.ఆర్.బి.సి.డ్రైన్ వద్ద దెబ్బతిన్న పైపు లైన్లను కూడా సొంత నిధులతో మరమ్మతులు నిర్వహించనున్నామని తెలిపారు. వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి వెంటనే పరిశీలించి తన సొంత నిధులతో పనులు చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మల్లేశ్వరి, డీఈ ప్రసాద్, ఏఈ వనిత, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్కే

వడ్డేశ్వరంలో శరవేగంగా రహదారుల నిర్మాణం



ఉండవల్లి లొద్దులో నిర్మిస్తున్న సీసీ రోడ్

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరంలో రూ.40.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని బుధవారం చేపట్టారు. వడ్డేశ్వరం పరిధిలోని మీ సేవ కేంద్రం పక్కన వున్న రహదారి పెనుమాక ఆనంద కుమార్ ఇంటి వద్ద నుంచి ఎస్కే సుభాని ఇంటి వరకు 200 మీటర్ల పొడవున, 3 మీటర్ల వెడల్పున రూ.19.50 లక్షలు వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో 180 మీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పుతో రూ.21 లక్షల వ్యయంతో మరో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ స్పెషల్ గ్రాంట్ నుంచి ఈ నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా చిర్రావూరు జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.96 లక్షల నిధులను కేటాయించింది. ఈ నిధులతో ప్రస్తుతం పాఠశాలలో 2 అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్లు డీఈ రెహమాన్ తెలిపారు. ఉండవల్లి లొద్దిలో అంగన్‌వాడీ స్కూల్ పక్కనే పి. గురవయ్య ఇంటి వద్ద నుంచి పి సీతమ్మ ఇంటి వరకు 180 మీటర్ల పొడవున, 3 మీటర్ల వెడల్పున కార్పొరేషన్ స్పెషల్ గ్రాంట్ నుంచి రూ.15 లక్షలు కేటాయించి సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఏఈ కిషోర్ తెలిపారు.



వడ్డేశ్వరం మీ సేవ కేంద్రం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- మేడికొండూరు జడ్పీ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

మేడికొండూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రధానంగా ఈ సంవత్సరం పదోతరగతిలో ఫెయిల్ అయి స్కూల్‌కు రాకుండా ఉన్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెత్తం నలుగురు విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలో కూడా ఫెయిలై స్కూలుకు రాకుండా ఇంటిదగ్గర ఉంటున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. వారిని మళ్లీ పదోతరగతిలో చేర్పించి, విద్య కొనసాగించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం వారికి జగనన్న విద్యాదీవెన కిట్లను అందజేశారు. అదేవిధంగా హైస్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. ప్రతిరోజు ఏలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం ధరించి బడికి రావాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శైలజ, సమగ్ర శిక్షణ ఏపీసీ విజయలక్ష్మి, ఎంఈఓలు ఏసురత్నం, అలీం, డిప్యూటీ తహసీల్దర్ కుంభా శ్రీనివాసరావు, హెచ్ఎం కె.జయప్రద, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మేడికొండూరు జడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఉపాధ్యాయులకు జేసీ రాజకుమారి హెచ్చరిక

గుంటూరు రూరల్: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయుల్ని జేసీ రాజకుమారి హెచ్చరించారు. మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డుల్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. విధుల్లో ఆలసత్వం వహించవద్దని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్మీడియేట్ కాలేజీల్లో చేరారో.. లేదో ? సమాచారం సేకరించాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని ''చైల్డ్ ఇన్ఫో వెబ్ సైట్''లో నమోదు చేసింది.. లేనిది? ఆరా తీశారు. ఇంకా నమోదు చేయని విద్యార్థులు ఉంటే వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద నాణ్యత గురించి విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. జగనన్న విద్యకానుక పంపిణీ వివరాలు, నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్ష జరపాలని హెచ్‌ఎంని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, హెచ్‌ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ

తెనాలిలో పోస్టర్లు, ఫ్లెక్సీల ఏర్పాటు నిషేధం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో అనుమతిలేని పోస్టర్లు, వాల్ పెయింటింగ్స్, ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయదలచిన వారు తమను సంప్రదించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ బీసీ రాయ్

తాడేపల్లిరూరల్: స్వాతంత్ర్య సమర యోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి. రాయ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం దుగ్గిరాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.సి.రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దుగ్గిరాల జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎ.సిద్దయ్య నాయుడు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బీసీ రాయ్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం భారతరత్న వంటి అత్యున్నత పురస్కారం ఇవ్వడంతో పాటు ఆయన పేరున జాతీయ పురస్కారాలు (రాజకీయ, సైన్స్, కళలు, సాహిత్యం మొదలైన రంగాలలో విశేష సేవలందించిన వారికి) ఇవ్వడంతో పాటు ఆయన జన్మదినమైన జూలై 1వ తేదీని జాతీయ వైద్యుల దినంగా ప్రకటించి అమలు చేస్తోందని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్, డాక్టర్ సి.ఇందిరలను జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేట్ పురస్కారాలను అందజేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నల్లనూకల వెంకటేశ్వరరావు, షేక్ సుభాని, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులు, వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ముస్లిం యువసేన అభ్యర్థుల నామినేషన్

మంగళగిరి: నగరంలో ఈనెల 23వ తేదీ జరగనున్న అంజుమన్ ట్రస్టు ఎన్నికలకు ముస్లిం యువసేన నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ముస్లిం యువసేన కన్వీనర్ ఇస్మాయిల్ నాయకత్వంలో యువసేన కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి మెయిన్ బజార్, మిద్దె సెంటర్, తెనాలి రోడ్, ఇస్లాంపేట, గౌతమ బుద్ధా రోడ్డు మీదుగా పాత బస్టాండ్ సెంటర్‌లోని అంజుమన్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో అక్రం బాషా, షేక్ అబ్జలి, అబ్దుల్ రషీద్, అమీర్ ఖాన్, షేక్ ఖాజా, షేక్ గాలి షహీద్, సయ్యద్ గౌస్ మెహిద్దీన్, షేక్ సలీం బాషా, షేక్ హజరత్ అలీలు ఉన్నారు.

నామినేషన్లు దాఖలు చేసిన ఇస్లామిక్ ఫ్రంట్ అభ్యర్థులు..

అంజుమన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇస్లామిక్ ఫ్రంట్ అభ్యర్థులు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్ ఆధ్వర్యంలో అభ్యర్థులు నగరంలోని టిప్పర్ల బజారు క్లాసిక్ కల్యాణ మండపం వద్ద నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి అంజుమన్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. అల్లాభక్షు, బద్రి, అక్బరీ, అబ్దుల్ అలీమ్, అబ్దుల్ సలీమ్, యాసీన్, నూర్ బాషా, హనీషా ఖాదరీ, హజ్రత్ అలీలు నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు.



ర్యాలీగా బయలు దేరిన ముస్లిం యువసేన అభ్యర్థులు

జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ

తెనాలిఅర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మారీసుపేటలోని 24వ వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డు, కార్డుల విభజన, ఇన్‌కం, క్యాస్ట్, బర్త్, డెత్, వివాహ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వంటి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మిలావణ్య, సచివాలయ అడ్మిన్ అబ్దులా తదితరులు పాల్గొన్నారు.



ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు

తేది 12-07-2023

Enrolment Number: 1370/1987